# తేలుకుట్టిన దొంగలు

"అమ్మా! అక్కా! బావొచ్చారే" చిన్నకూతురు మానస కేక విన్న దేవకి మనసులో మల్లెల జల్లు కురిసింది. చేతులు కొంగుకు తుడుచుకుంటూ బయటి కొచ్చి పెద్దకూతురు భారతిని గుండెలకు హత్తుకుంది. అల్లుడు సుధీర్ వైపు చూస్తూ -

"బాగున్నారా బాబూ!" ఆప్యాయంగా పలుకరించింది. మానస హుషారుగా "బావ గుండ్రాయిలాగున్నారు. అక్కే చిక్కి చీపురు పుల్లలాగైంది" గలగలా నవ్వేసింది.

నేనేం తక్కువ తిన్నానా అనుకున్నాడు సుధీర్... "పాపం! ముప్పూటలా తిని కూర్చోలేక మీ అక్క అలాగైపోయింది మరదలా!" అంటూ నెత్తిమీదో మొట్టికాయిచ్చాడు.

భార్యవైపు చూస్తూ "మీ సిసింద్రీ చెల్లికి చిచ్చుబుడ్డి మొగుడు దొరకాలి భారతీ!" అన్నాడు తమాషాగా.

భారతి గర్వంగా కనుబొమ్మలెగరేస్తూ "మా మానస అతగాడ్ని మూడు దేశాలు తిప్పి, మూడు సముద్రాల నీళ్లు తాగిస్తుంది" అంది.

"అబ్బా! లోపలికొచ్చి మాట్లాడుకోవచ్చుగదా!" అంది దేవకి కుర్చీలను చూపిస్తూ. అప్పుడే గడపదాటి వస్తున్న భర్త నారాయణ "ఆ... వస్తున్నానోయ్... వస్తున్నా" కండువా సవరించుకున్నాడు.

"లోపలికి రమ్మన్నది మిమ్మల్ని కాదు మహాశయా! మన కూతుళ్లు, అల్లుణ్ని" అంది చేతు లూపుతూ.

"అయితే బయటికెళ్లిపోనా? చూడమ్మా, మీ అమ్మ మర్యాద!" కూతుళ్లతో మొరపెట్టుకున్నాడు. హాయిగా నవ్వుకున్నారంతా. వెంటనే కుశల ప్రశ్నల్లోకి దిగారు. దీపావళి పండుక్కొస్తామని సుధీర్ వారం క్రితమే ఫోన్‌లో చెప్పాడు. నారాయణ దంపతుల సంబరం అంబరాన్నంటింది.

భారతి సర్దుక్కూచుంటూ "నాన్నా! ఎన్నిసార్లు రమ్మన్నా మాయింటికి రావట్లేదు. చెల్లి వద్దన్నదా?" అంది.


నారాయణ మాత్రం "అదెంకందుంటుందమ్మా! మీరిద్దరూ నాకు రెండు కళ్లు. ఈ ఊళ్లో గ్రంథాలయం ప్రారంభించారు. రెగ్యులర్ లైబ్రేరియన్ వచ్చేదాకా నేనే లైబ్రేరియన్ని. దానికి తోడు ఇక్కడో వైద్యశాల ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నాం" అన్నాడు.

"అయితే మామగారు విశ్రాంతి ఉద్యోగియైనా అవిశ్రాంతంగా ప్రజాసేవ చేస్తున్నారన్నమాట!" అన్నాడు పైకి సుధీర్. లోలోపల మాత్రం "పూర్‌ఫెలో... పట్నంలో రిటైరై పల్లెటూరు కొచ్చిండు" గొణుక్కున్నాడు.

సైకాలజీ లెక్చరర్‌గా పనిచేసిన నారాయణ

అల్లుడి అభిప్రాయాన్ని చదివేశాడు. "పల్లెటూళ్లు దేశానికి పట్టుగొమ్మలల్లుడుగారూ! జనమంతా పట్నాల్లో ఉంటే రేపు పౌరులు బియ్యం చెట్లు, మామిడితీగలు అంటారు సుమా!" అనగానే గొల్లున నవ్వారంతా.

దేవకి, మానస వంటింట్లో కెళ్లారు. మిగిలినవారు కబుర్లలోకి దిగారు. ముచ్చట్లు మురిపాల మధ్యలో... రైలు డబ్బాలో "చాయగరం... చాయగరం" చాయ వాలాలా రాగాలు తీస్తూ మానస వచ్చి తలా ఓ కప్పు అందించింది. సుధీర్ ఆమెనాపాద మస్తకం పరిశీలిస్తున్నాడు. సింధూర వర్ణం దేహఛాయ, తీర్చిదిద్దిన అంగ సౌష్టవం... కుందనం బొమ్మలాగుంది.



ఐలా చంద్రయ్య

సంతానయోగం లేదనుకున్న నారాయణ దంపతులు భారతిని అనాధశరణాలయం నుంచి తెచ్చి పెంచుకున్నారు. ఆ తర్వాత మానస జన్మించింది. సుధీర్ ఆలోచన వేరుగా ఉంది. "ఈ మానస పుట్టకపోతే మామగారి ఆస్తులన్నీ మాకే చెందేవి" అనుకుంటూంటే మొహంలో రంగులుమారాయి.

"ఇంకో చాయ్ కావాలా బావా?" కావాలనే అడిగింది మానస.

"ఈ కొసరి వడ్డింపులు కట్నాల దగ్గరుండాలి మరదలా!" అంటూ సర్దుకున్నాడు.

"మా అక్కే కోట్లకట్నం బావా!" అంటూ మానస ఖాళీకప్పులందుకుని వెళ్లిపోయింది.

సరిగ్గా అదే సమయంలో... సద్దుల బతుకమ్మ లాగున్న ఆర్టీసీ బస్సు హైదరాబాదు హద్దులుదాటి పల్లెబాట పట్టింది. ఆ బస్సులో మధుకర్ ఉన్నాడు. యుద్ధంలో కాలు పోగొట్టుకున్న వీరసైనికుడతడు. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో బ్యాంకు ఉద్యోగంలో చేరాడు.

కుదుపులతో బస్సు ముందుకెళ్తూంటే జైపూర్ పెట్టుడుకాలుని సర్దుకుని సీటుకు జేరిగిలబడ్డాడు. జీవనయానంలోని గతం దృశ్యాలు మనసులో మెదుల్తున్నాయి...

ఊహ తెలియని వయసులో అమ్మానాన్నలు ఆక్సిడెంట్‌లో ప్రాణాలొదుల్తూ తనను నారాయణ మామయ్య చేతుల్లో పెట్టారు. అత్తయ్య-మామయ్యలు తల్లిదండ్రులై పెంచారు. ఇంటర్ అవగానే ఉద్యోగమొచ్చింది. ట్రెయినింగ్‌కెళ్లేముందు అత్తయ్య మామయ్యల కళ్లు మంచుపూలైనాయి.

"మిలట్రీలో ఉద్యోగం గర్వకారణమే కాని నువు నా ముద్దుల చెల్లి తీపిగుర్తువురా!" అన్నాడు మామయ్య. "కొడుకులు లేని మాకు నువ్వే కొడుకనుకున్నామయ్యా!" అంది అత్తయ్య కన్నీళ్లు కొంగుతో అద్దుకుంటూ. నిలువెల్లా చలించిపోయాడు.

"మామయ్యా! దేహంకన్నా దేశం మిన్నగదా!"తో ప్రారంభించి ఇద్దరినీ సముదాయించాల్సి వచ్చింది. మానస మాత్రం బాధ బయటపడకుండా "అమ్మా! బావకా ఉద్యోగం దొరకడం మన అదృష్టమే. పోనీయండి" అంటూ తానే మద్దతిచ్చింది.

మానస రూపం కళ్లల్లో కదలాడింది. చిన్నప్పుడు చెట్టాపట్టా లేసుకుని తిరిగిన మరదలు పెళ్లీడుకొచ్చింది. ఎవరు చేసుకుంటారోగాని... అదృష్టవంతుడు. యుద్ధంలో కాలుపోకపోతే మానస నాసొంతమయ్యేదేమో!... కీచ్ మంటూ బస్సు ఆగింది. పెట్టుడుకాలు సరిచేసుకుని దిగాడు.

సాయం సమయం... పల్లె వాతావరణం తల్లి ఒడిలాంటిది. ఊళ్లోకొస్తున్న పశువుల గోధూళి ఆకాశంలో పయనిస్తున్న పక్షులనంటుకోవాలని ఆరాటపడుతోంది. ఇల్లు దగ్గరైంది. పక్కింటి అరుగుమీద కూచ్చున్న రామయ్యతాత "ఓ రామ! రామ రామరామ రామరాఘవా! నా స్వామిదనీ నమ్మితి దరిజేర్చి బ్రోవవా!" అంటూ కులాసాగా పాడుకుంటున్నాడు. ఒళ్లు పులకరించింది.

గడపలో ఎదురైన మానస మొహం పున్నమి కలువలా విచ్చుకుంది. చేతిలోంచి సూటుకేసందుకుంది.

"అక్కా! మధు బావొచ్చాడే!" చిన్నపిల్లలా గెంతులేస్తూ వసారాలో కొస్తున్న భారతి కెదురెళ్లింది.

భారతి మూతి మూడు వంకర్లు తిరిగింది.

"ఇక్కడికి రాక ఎక్కడికెళ్తాడులే!" గొణుక్కుంటూ సోఫాలో భర్తపక్కన కూలబడింది. మధుకర్ లోపలికొచ్చాడు.

"వదినా! అన్నా! బాగున్నారా?" ఆప్యాయంగా పలుకరిస్తూ వారికెదురుగా కూర్చున్నాడు. మానస అందించిన సూటుకేసులోంచి మడిచి పెట్టుకున్న చంకకర్రల్ని తీసి, అమర్చుకుని పక్కన పెట్టుకున్నాడు.

పెట్టుడుకాలు విప్పుతూ... "పిల్లలు రాలేదా అన్నా?" మళ్లీ పలుకరించాడు. పొంగుకొస్తున్న కుళ్లునంతా అదిమిపెట్టి "రాలేదు!" అని ముక్తసరిగా జవాబిచ్చాడు సుధీర్. భార్యచెవిలో గుసగుసగా "ఈ దరిద్రుడు ఎందుకూడిపడ్డాడో! వెధవ!" అన్నాడు. భారతి మరోసారి మూతి తిప్పింది. వాళ్ల ప్రవర్తన మానసకేమాత్రం నచ్చలేదు.

"రా మధు బావా!" అంటూ పెట్టుడుకాలుతో సహా సూటుకేసును గదిలోకి తీసుకెళ్లింది. మధుకర్ నిట్టూర్చి కర్రల సాయంతో లేచి నుంచున్నాడు. గుడికెళ్లిన దేవకి దంపతులు లోపలికొచ్చారు. వారి కళ్లల్లో కాంతిరేఖలు విచ్చుకున్నాయి.

"మధూ! బాగున్నావా?" నారాయణ గుండెలకు హత్తుకున్నాడు. స్నేహమామ ఒడి దేవుని గుడిలా అన్పించింది.

"నిన్ను చూసి చాలారోజులయిందయ్యా!" దేవకి ఎదపొంగింది.

తెల్లవారితే దీపావళి పండుగ.

రాత్రి భోజనాలయ్యాక అంతా పడుకున్నారు.

ఆనాడే కొండంత పండుగ దీపావళి. తూరుపు ఆకాశం బంగారు రంగు పులుముకోబోతుంది. మానస వెళ్లి గదితలుపు కొట్టి అక్కా బావలను నిద్రలేపింది.

"పొద్దు పొడవకముందే హారతులు తీసుకోవాలి. మేము, మధుబావా రెడీ" హెచ్చరించి వెనుదిరిగింది.

కమ్మని నిద్ర ఖరాబైనందుకు గుర్రుగా ఉంది సుధీర్‌కి.

"వానికేం...! తెగిన గాలిపటం. అంటూ బాత్రూంలో దూరబడ్డాడు. భారతి త్వరగా తయారై "త్వరగా తెమలండీ. అమ్మానాన్నలకు కోపమొస్తుందేమో! తొందరపెట్టింది. "అవునవును. కోపమొస్తే ఆ పట్నం బంగళా, ఇక్కడి ఆస్తులు మధుగానికో, మానసకో రాసేస్తారేమో!" అన్నాడు.

"ముందు మానసకు పెళ్లిచేసి పంపించాలి. ఆ తర్వాత ఆస్తుల గురించి అడగొచ్చు. ఏదిఏమైనా ఆ మధుకర్‌కేమీ దక్కకుండా చెయ్యాలి" అంటూ దువ్వనారంభించింది.

"నిజమే భారతీ! అమెరికాలో ఉన్న మా ఆఫీసర్ కొడుక్కి మానస ఫోటో పంపానుగదా! అతనికి మానస నచ్చిందట. త్వరలోనే ఇండియా వస్తున్నాడు. ప్రయత్నించి అతన్తో మానస మెడలో మూడు ముళ్లేయించాలి. వాళ్లు కోటీశ్వరులు. కట్నమడగరు. ఈ ఆస్తులకాశపడరు డియర్!" అంటూ భార్య చెంపమీద చిటికేసాడు.

"హబ్బా! మీ బుర్ర లాప్‌టాప్ కంప్యూటరండీ! ఆ తర్వాత ఆస్తులన్నీ మన పేర రాయించుకోవచ్చు!" మురిసిపోయింది.

భర్తను వెంటబెట్టుకుని పూజగదికొచ్చింది. అప్పటికే దేవకి దంపతులు మంగళహారతులకే

ర్పాట్లు చేసుంచారు. కూతుళ్ల కోసం ఎదురుచూ స్తున్నారు. ఇదే సమయమనుకుంది భారతి.

"అమ్మా! మానసను ఆ అవిటి మధుకెంత దూరంలో ఉంచితే అంత మంచిదే!" అంది పట్టుచీర కొంగు సవరించుకుంటూ. ఆ మాట ల్లోని అంతరార్థం దేవకికర్థమై మొహం చిట్లిం చింది.

"వాడు వీర జవానమ్మా! దేశం కోసం కాలు పోగొట్టుకున్నవాణ్ని అవిటివాడన్న వారిదే అవ గాహన రాహిత్యం. వాళ్లనే అవిటివారనాలి. ఇహ వాడికి పెళ్లి చేస్తే మా బాధ్యత తీరిపోతుం ది" అంది సముదాయింపుగా. అదే నిజమన్నా డు నారాయణ.

సుధీర్ అందుకుని "మానస పెళ్లి తర్వాత అతని గురించి ఆలోచించి తీరాల్సిందే మావ య్యా!" సలహా అందించాడు. భార్య వైపు గర్వం గా చూసాడు.

అప్పుడే మధుకర్‌ని వెంటబెట్టుకుని వచ్చిం ది మానస.

"అంతా వచ్చారుగదా! ఇహ కానీ!" పుర




మానస ఆర్ట్ థియేటర్, శ్రీ త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో గానసభలో ప్రపంచ నవ్వుల దినోత్సవం, మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని కళాంజలి పేరిట జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి శ్రీ ఇనాక్. ఈ కార్యక్రమంలో మిమిక్రీ కళాకారులు చిట్టూరి గోపీచంద్‌ని ఘనంగా సత్కరించారు. కళాకారుల మాతృమూర్తులయిన శ్రీమతి సవితా నాయుడు, జ్యోత్స్న, డా॥ ఈదుపుగంటి పద్మజారాణిలకు ప్రకృతిమాత అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. సభలో డాక్టర్ కె.వి. రంగారావు, మోహనకృష్ణ, సన్మానగ్రహీతలు ప్రసంగించారు. సభాకార్యక్రమానికి ముందు బేబి శ్రీవిద్య, చిట్టూరి గోపీచంద్ బృందం మిమిక్రీ, పాటలు సభికులను రంజింపజేసాయి.

మాయించాడు నారాయణ.

ఆడవారు మగవారికి హారతులిస్తుంటే అందరి కళ్లూ ఆనంద జ్యోతులైనాయి. తీర్థప్రసాదాలందుకుని అంతా బయటకొచ్చి టపాసులు పేలుస్తుంటే దేవకి పనిమనిషి సాయంతో వంటలో మునిగిపోయింది. మానస మనసులో ఏముందో తెలుసుకోవాలనుకున్నాడు సుధీర్.

"పప్పన్నమెప్పుడు పెట్టిస్తావు మరదలా!" అడిగాడు.

"మీ రెప్పుడంటే అప్పుడే బావా!" ఠపీమని జవాబిచ్చింది.

నా మరదలికి నా మాట మీద ఎంత గురి... అనుకుంటూ మురిసిపోయాడు సుధీర్.

"ఆనంద మానందమాయెనే... మా చెల్లెమ్మ పెళ్లికూతురాయనే" అంటూ మానస జడ లాగింది భారతి. మానస చెక్కిళ్లు సిగ్గుల భారంతో ఎర్రబారినై. మధుకర్ కళ్లల్లోకి చూస్తుంటే ఎర్రని పెదాల మీద తెల్లని చిరునవ్వులు ముత్యాల్లా మెరిసాయి.

భారతి భర్తనే చూస్తూ "మానస పెళ్లవగానే మధుకర్ పెళ్లి ప్రయత్నాలుంటాయి. మధు పెళ్లి కూడా అయిపోతే మా అమ్మా నాన్నల బాధ్యత తీరిపోతుంది కదండీ!" అంది.

"అవునవును" బలపరిచాడు సుధీర్. టపాసులు కాల్చి అంతా లోపలికొచ్చారు. వంటింట్లో పిండివంటల ఘుమఘుమలు ముక్కుపుటాలకు తాకుతున్నాయి.

"ముచ్చట్లు చాలుగానీ, టిఫిన్‌కి రండి" దేవకి పిలుపుతో అంతా వెళ్లి డైనింగ్ టేబుల్ ముందున్నారు.

నారాయణ వాలకం గంభీరమైంది. "మధూ, నీ పెళ్లి గురించి నీ అభిప్రాయమేమిటి?" అడిగాడు.

అత్తయ్య-మావయ్యల పట్ల మధుకర్ అణువణువూ కృతజ్ఞతతో నిండి ఉంది. "అమ్మానాన్నల్లా ఆత్మీయత పంచి యిచ్చిన మీకు తెలియకుండా నేనేదీ చెయ్యను మావయ్యా!" కరాఖండిగా చెప్పాడు. పక్కింటివాళ్లు పేలుస్తున్న టపాసుల శబ్దం వినబడుతోంది. మానస "నాన్నా! మీరన్నా, దేశమన్నా మధుబావకెంతో ప్రేమ" అంది.

భారతి అందుకుని "నువ్వేవరినయినా ప్రేమించావా చెల్లీ?" అడిగింది. "ప్రేమిస్తే నీ మానసచోరుడెవరో చెప్పు" అని కూడా అంది. మానస కొంటెచూపులు మధుకర్ వైపు మళ్లాయి.

"మధుబావ సైన్యంలో చేరుతానన్నప్పుడే అతనికి నా మనసు అంకితమైపోయింది. మధుబావ గుండెగూటిలో నేనున్నానని నాకు తెలుసు. కాబట్టి ఇంతకుముందే మాట్లాడుకున్నాం. మీ అందరి ఆశీస్సులతో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం."

మధుకర్ మనసు మయూరమై నర్తించింది.

"అవును మావయ్యా మేము నిర్మొహమాటంగా మాట్లాడుకున్నాం. మీరు ఆశీర్వదిస్తే..." అంటూ చంకకర్రలు పక్కన పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

నారాయణ-దేవకి అంతరంగాల్లో సంతోష తరంగాలెగసిపడినై. "శుభం"... అంటూ కోరస్‌గా దీవించారు. దేవకి అందరి ప్లేట్లలో సర్వపిండి వడ్డిస్తూంటే మిగతావారూ కూర్చున్నారు.

సుధీర్ - భారతిలు తేలుకుట్టిన దొంగలయ్యారు. ●